క్లుప్తంగా

అఖండ అన్న సమారాధన

వీరఘట్టం: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి సెంటర్‌లో గురువారం అఖండ అన్నసంతర్పణ నిర్వహించారు. యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్ శర్మయాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ అన్న సంతర్పణకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

22న మెగా వైద్య శిబిరం

సీతంపేట: ప్రధానమంత్రి దేశ వ్యాప్తంగా ప్రారంభించిన స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22న సీతంపేట ఏరియా ఆసుపత్రిలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్టు సూపరెంటెండెంట్ బి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు ఎన్‌సీడీ స్క్రీనింగ్, రక్తపోటు, నోటిక్యాన్సర్, స్థన, గర్భాశయ ముఖ క్యాన్సర్, క్షయ వ్యాధి స్క్రీనింగ్ నిర్వహించనున్నామన్నారు. కౌమర బాలికలకు వచ్చే రుతు సమస్యలపై ప్రత్యేకంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు.

జట్టు ఆశ్రమం సందర్శన

గుమ్మలక్ష్మీపురం: ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని, ఆత్మవిశ్వాసం ఉంటే ఎంతటి పని అయినా సాధ్యమవుతుందని పార్వతీపురం జట్టు ఆశ్రమ నిర్వాహకురాలు పద్మజ అన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పార్వతీపురంలోని జట్టు ఆశ్రమాన్ని గురువారం సందర్శించారు. ఆశ్రమంలో నిర్వహిస్తున్న వేస్ట్ మేనేజ్‌మెంట్ రీసైక్లింగ్, బయోగ్యాస్ ఉత్పాదన ప్రాజెక్ట్‌లపై అవగాహన కల్పించారు.

ఎంపీడీవోగా వసంతకుమారి

భామిని: మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా ఎస్.వసంతకుమారి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు మండల పరిషత్ సిబ్బంది స్వాగతం పలికారు. గడిచిన ఆరు నెలల్లో ఎనిమిది మంది ఎంపీడీవోలు ఇన్‌చార్జిలుగా వ్యవహరించారు. ప్రస్తుతం పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టిన వసంతకుమారి కూడా కొత్తూరు ఈవోపీఆర్‌డీగా ఉంటూ గతంలో ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

దాసరిపేటలో వైద్య శిబిరం

జియ్యమ్మవలసరూరల్: మండలంలోని తాళ్లదుమ్మ పంచాయతీ, దాసరిపేటలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ శంకరరావు, వైద్యుడు జగదీష్ తదితరులు శిబిరానికి హాజరైన రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

ఆత్మ రక్షణ కోసం...

పాలకొండ రూరల్: ఆత్మ రక్షణకు బాలికలు కరాటేలో నైపుణ్యం పొందాలని శక్తి టీమ్ సభ్యురాలు, ఏఎస్ఐ జి.ఝాన్సీబాయ్ అన్నారు. పాలకొండ హట్కో కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ క్రమంలో ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్, పోక్సో యాక్ట్‌పై వివరించారు. 11 రకాల సేవలు అందించే శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. సమస్యలు తలెత్తితేటోల్ ఫ్రీ నంబర్ 112కు లేకుంటే 9154874336కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ ప్రకృతాంబ, రాము తదితరులున్నారు.

పేదలకు పక్కా ఇళ్లు

పాలకొండ రూరల్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టనున్నట్టు హౌసింగ్ ఈఈ జి.రవికుమార్ అన్నారు. పాలకొండ ఇందిరానగర్ కాలనీలో అంగీకార 2025 కరపత్రాలను గురువారం విడుదల చేశారు. పీఎంఏవై పథక లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తమ సిబ్బందికి, సచివాలయ అధికారులకు సూచించారు. పట్టణ ప్రజల విభిన్న గృహ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నాలుగు పద్ధతుల ద్వారా అర్హులకు గృహ మంజూరు, నిర్మాణాలకు సహకరించేలా ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఈఈ తెలిపారు. కార్యక్రమంలో నగర కమిషనర్ రత్నరాజు, గృహనిర్మాణ శాఖ ఏఈ యు.సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం వద్దు..

పాలకొండ: కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చూడాలని తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని గారమ్మ కాలనీలో సుమోటో కుల ధ్రువీకరణ పత్రాల జారీని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సుమోటో కుల ధ్రువీకరణ జారీపై అవగాహన కలిగించారు. పలు సచివాలయాను సందర్శించి సచివాలయ సిబ్బందికి అవగాహన కలిగించారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలి

పాలకొండ రూరల్: వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీతంపేట ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. గురువారం పాలకొండ బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మమేకమై వారికి అందుతున్న వసతులు, బోధనపై ఆరా తీశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధించి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. ఇటీవల జరిగిన నెలవారీ పరీక్షల్లో 60 శాతం కంటే తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు చేపట్టాలని సూచించారు. అనంతరం భోజన శాల, వంటల నిర్వహణ తీరు, వంటకాల రుచిని పరిశీలించారు.



గుమ్మలక్ష్మీపురంలో చివరి దశలో నిలిచిన సీహెచ్‌సీ కొత్త భవన నిర్మాణం



కురుపాంలో ప్రారంభానికి నోచుకోని సీహెచ్‌సీ అదనపు భవనం



కురుపాం సీహెచ్‌సీలో ఇరుకైన హాల్‌లో వైద్యసేవలు పొందుతున్న రోగులు(ఫైల్)

ప్రభుత్వ నిర్లక్ష్యం.. ప్రజలకు అందని వైద్యం!



కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్థలాభావం కారణంగా చెట్టు కింద నిరీక్షిస్తున్న రోగులు(ఫైల్)

- ఆస్పత్రి భవన నిర్మాణాల పూర్తిపై కూటమి అలసత్వం
- అరకొర వసతులతో వైద్యం పొందుతున్న రోగులు
- చివరి దశలో నిర్మాణాలున్నా పూర్తికి చొరవచూపని సర్కారు
- అవస్థలు పడుతున్న ఇన్, అవుట్ పేషెంట్లు

కురుపాం: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు వైద్యసేవలు సక్రమంగా అందడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు మెరుగైన వైద్యం అందివ్వడమే లక్ష్యంగా గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద ఆస్పత్రుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. పాత ఆస్పత్రులను బాగు చేయడం, అవసరమైన చోట అదనపు భవన నిర్మాణాలు చేపట్టడం జరిగింది. ఈ క్రమంలో గుమ్మలక్ష్మీపురం సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం), కురుపాం సీహెచ్‌సీ కొత్త భవన నిర్మాణాలు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు ఆయా నిర్మాణాల పూర్తిపై పూర్తిగా అలసత్వం వహిస్తుండడంతో రోగులకు వైద్య సేవలు దూరమవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. త్వరితగతిన ఆ నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకుని వస్తే రోగులకు అవస్థలు తప్పేవి కదా అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

–ఒకే బెడ్డుపై ఇద్దరికి చికిత్స!

కురుపాం, గుమ్మలక్ష్మీపురం ప్రాంతాల్లోని సీహెచ్‌సీ కొత్త భవనాలు అందుబాటులోకి రాకపోవడంతో ఆయా ఆస్పత్రుల్లో ఒకే బెడ్డుపై ఇద్దరు రోగులకు వైద్యం అందించాల్సిన దుస్థితి నెలకొందని రోగులు, రోగుల బంధువులు చెబుతున్నారు. సరిపడ స్థలం లేని కారణంగా ఒక్కోసారి బయట ఉండాల్సి వస్తోందని రోగుల తరపు బంధువులు అంటున్నారు. ముఖ్యంగా గర్భిణులకు వసతి సమస్య వెంటాడుతోంది. అలాగే ఇన్ పేషెంట్లు, అవుట్ పేషెంట్ల సేవలకు కూడా ఆటంకం కలుగుతోంది. అదే కొత్త భవనాలు పూర్తయితే రోగులకు ప్రశాంత వాతావరణంలో సక్రమంగా సేవలందుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే నిర్మాణాలు నిలిచిపోయాయని, ఈ ఏడాది మార్చి నాటికి నిర్మాణాలు పూర్తయి వైద్యవిధాన పరిషత్‌కు అప్పగించాల్సి ఉండగా, కూటమి సర్కారు అశ్రద్ధ వల్ల అది జరగడం లేదని అందరూ అంటున్నారు.

–పెరుగుతున్న రోగుల తాకిడి..

కురుపాం సీహెచ్‌సీకి రోగుల తాకిడి రోజురోజుకూ ఎక్కువవుతోంది. కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం మండలాల గిరిజనులు, ఇతర ప్రజలంతా ఇదే ఆస్పత్రిపై ఆధారపడడంతో రోజూ వచ్చే ఓపీ సంఖ్య మరుసటిరోజు ఎక్కువగానే ఉంటోందని సిబ్బంది చెబుతున్నారు. చాలీచాలని వసతులున్నా తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడే వైద్యం పొందాల్సిన పరిస్థితి. స్థలం కొరత కారణంగా రోగులను పరామర్శకు వచ్చిన వారు ఆస్పత్రి బయట చెట్టునీడలో ఉండాల్సిన దుస్థితి. ఇప్పటికైనా చివరి దశలో నిలిచిపోయిన ఆస్పత్రి భవనాలను పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని రోగులు కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి..



ప్రభుత్వం చొరవతీసుకుని, నిలిచిన ఆస్పత్రుల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి. కొత్త భవనాలు ప్రారంభమైతే తప్ప రోగుల ఇక్కట్లు తొలగవు. కూటమి సర్కారు ఇప్పటికైనా రోగుల ఇబ్బందులు పట్టించుకోవాలని. వారి సమస్యలు తొలగించాలి.

–జి.సుజాత, జెడ్పీటీసీ, కురుపాం

మెరుగైన వైద్యం అందించాలి..



ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలి. వైద్యులను 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలి. ప్రతి రోగి ఆరోగ్యంతో ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లేలా చూడాలి. ఆగిపోయిన ఆస్పత్రి భవన నిర్మాణాలు పూర్తి చేసి, ప్రారంభించాలి.

–కె.దీనమయ్య, ఎంపీపీ, గుమ్మలక్ష్మీపురం

ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం పూర్తి చేయండి

కురుపాం: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇంజినీరింగ్ కళాశాలను త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిర్మాణ దశలోని కళాశాలను ఆయన గురువారం సందర్శించి, విలేకరులతో మాట్లాడారు. నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చిందని, ఈ దశలో నిర్మాణం పూర్తిపై దృష్టి సారిస్తే ఇక్కడి గిరిజనులకు ఇంజినీరింగ్ విద్యను దగ్గర చేసిన వారవుతారన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు చొరవ తీసుకుని, ప్రభుత్వంతో నిర్మాణం పూర్తి చేయించే బాధ్యతను తీసుకోవాలన్నారు. కనీసం వచ్చే విద్యా సంవత్సరం నాటికి అయినా కళాశాల ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. అలాగే పార్వతీపురంలోని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు పూర్తి చేయాలని, ప్రభుత్వ వైద్య కళాశాలలను కూడా పీపీపీ విధానంలో కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలన్నారు.



ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి

గిరిజన విద్యార్థినులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

సీతంపేట: గిరిజన విద్యార్థినులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పాలకొండ సబ్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థినుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. టెన్త్ విద్యార్థులతో ముఖాముఖి అయ్యారు. ఉన్నత చదువులు ఎలా చదవాలి.. కాంపిటేటివ్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలనేది సూచించారు. ఎవరి లక్ష్యం ఏంటనేది తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినుల మెనూ పరిశీలించారు. పాఠశాల ఆవరణలో కూరగాయల తోటలను చూశారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో విద్యార్థినులు తయారు చేసిన ఇన్నోవేషన్స్ ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టుల గూర్చి క్షుణ్ణంగా వివరించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యూవో పాలక అమల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులు తయారు చేసిన ప్రాజెక్టులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ పీవో

మాజీ ఎమ్మెల్యే కళావతి పరామర్శ

భామిని: పలువురి బాధితుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం పరామర్శించారు. మండలంలోకి సింగిడికి చెందిన విద్యావతి సాంత్రో ఇటీవల అస్వస్థతకు గురై మృతి చెందారు. ఘనసరకు చెందిన కిల్లారి తేజాలు కొత్తూరులో ఓ పీఎంపీ నిర్లక్ష్యం వల్ల మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆమె వీరి కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆమె వెంట పార్టీ నాకులు తోట సింహాచలం, బోనగడ్డి ధర్మారావు, కిల్లారి పాల్గుణరావు, మడపాన కేశవ, కొత్తకోట చంద్రశేఖర్, పిరపక శ్రీను, మేడిబోయిన చలపతి, పోతల మజ్జి, పత్తిక సింహాచలం తదితరులు ఉన్నారు.



సింగిడిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి,

మున్సిపల్ కార్మికుల ఆందోళన

పాలకొండ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు గురువారం నగర పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ ఒప్పంద కార్మికులకు 12వ పీఆర్‌సీ చెల్లించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన జనాభా మేరకు కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం కమిషనర్ రత్నంరాజుకు వినతిపత్రం అందించారు.



పాలకొండ: నగరపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కాళ్లరిగేలా తిరుగుతున్నా.. ఒక్క బస్తా యూరియా ఇవ్వరా?

కొమరాడ: ఒక్క యూరియా బస్తా కోసం కాళ్లరిగేలా తిరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కెమిశీల పంచాయతీ సర్పంచ్ తాడంగి భీమయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇదే విషయమై గురువారం సాక్షి విలేకరులతో మాట్లాడారు. తమ పంచాయతీ రైతు సేవా కేంద్రానికి 500 యూరియా బస్తాలు వచ్చినా అవేవీ రైతులకు అందడం లేదని, వాటిని కూటమి నాయకులకే ఇచ్చేస్తున్నారని ఆరోపించారు. ఇలా అయితే అమాయకులమైన గిరిజన రైతులకు యూరియా ఏ విధంగా అందుతుందని ప్రశ్నించారు. ఇదే విషయంలో మండల వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



భీమయ్య

డ్వాక్రా మహిళల జీవనోపాధులు పెంపొందించాలి

వీరఘట్టం: డ్వాక్రా సంఘాల జీవనోపాదులు పెంపొందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని డీఆర్‌డీఏ పి.డి. సుధారాణి సూచించారు. వెలుగు కార్యాలయంలో ఏపీఎం కె.రాము, వీవోఏలు తదితరులకు గురువారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. డ్వాక్రా గ్రూపులు తీసుకుంటున్న రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా చూడాలన్నారు.

కనులుండి.. చూడలేకున్నారు..

- వైఎస్సార్ సీపీ పోస్టర్ ఆవిష్కరణ
- నేడు చలో మెడికల్ కాలేజ్



చలో మెడికల్ కాలేజ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాలకొండ రూరల్:

కూటమి ప్రభుత్వం జగనన్న హయాంలో జరిగిన అభివృద్ధిని కనులుండి చూడలేకపోవడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్ అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రంలో శ్రీకారం చుట్టిన 17 మెడికల్ కాలేజ్‌లకు సంబంధించి నేటి ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు. అన్ని వర్గాల విద్యార్థులకు ఉన్నత చదువులు చేరువ చేసిన జగనన్నపై కూటమి నేతలు ఆరోపణలు చేయడంపై మండిపడ్డారు. పార్టీ పిలుపుతో పార్వతీపురం జిల్లా కేంద్రం ఆసుపత్రి సమీపంలో నిర్మాణ దశలో ఉన్న మల్టీ సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రి వద్ద శుక్రవారం చేపట్టనున్న శాంతియుత ర్యాలీలో అన్ని వర్గాల విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు చలో మెడికల్ కాలేజ్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు, నగర పాలక వర్గ సభ్యులు వెలమల మన్మధరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోట అజయ్‌కుమార్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు, యువజన విభాగం అధ్యక్షులు అల్లు సురేష్‌కుమార్, వారాడ నాగేంద్రనాయుడు, బలగ మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

కొమరాడ: కేంద్ర ప్రభుత్వ పథకమైన ఆదికర్మయోగి అభియాన్‌లో భాగంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీడీవో ఎస్.రమేష్ సూచించారు. మండలంలోని దేవుడుకోన గ్రామంలో గ్రామసభ గురువారం నిర్వహించారు. గ్రామంలో ఏయే మౌలిక వసతులు కల్పించాలన్న విషయాలను మండల అధికారుల బృందం గుర్తించి, వాటి వివరాలు గ్రామసభలో చదివి వినిపించారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు 16వ తేదీ వరకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల సుస్థిరాభివృద్ధే ఆదికర్మయోగి అభియాన్ లక్ష్యమని ఆ ప్రాజెక్టు అసోసియేట్ దివ్యానందన్ అన్నారు. మండలంలోని రెల్ల, అడ్డంగూడ గ్రామాల్లో ఆదికర్మ యోగి అభియాన్ గ్రామసభలు గురువారం నిర్వహించారు. గ్రామాల్లో ఏయే మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి, కల్పించాల్సిన మౌలిక వసతులపై చర్చించారు.

ప్రతి గ్రామం సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్నదే ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఆ దిశగా అధికారులు కృషి చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల మరుగుదొడ్లకు తాళం

కురుపాం: స్థానిక గొడువీధి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం నిర్మించిన మరుగుదొడ్లకు తాళం వేసి ఉండడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పథకం కింద విద్యార్థుల కోసం మరుగుదొడ్లు నిర్మిస్తే వారికి ఉపయోగపడనీయకుండా ఇలా తాళాలు ఎందుకు వేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. పాఠశాల సిబ్బంది కొత్త మరుగుదొడ్లు వినియోగించుకుని ఆ తర్వాత దానికి తాళాలు వేయగా, శిథిలావస్థలోని మరుగుదొడ్లకు విద్యార్థులు వెళ్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యార్థులు ఆ మరుగుదొడ్లు వినియోగించుకునేలా చూడాలని అధికారులను కోరుతున్నారు.



ప్రభుత్వ పాఠశాల మరుగుదొడ్లుకు వేసిన తాళం

ప్రకృతి వ్యవసాయోత్పత్తుల స్టాల్ ఏర్పాటు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని అడ్డంగూడలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయోత్పత్తుల స్టాల్‌ను ఆదికర్మ యోగి అభియాన్ ప్రాజెక్టు అసోసియేట్ దివ్యానందన్ గురువారం పరిశీలించారు. రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన పంటలు ఆరోగ్యానికి మంచివని ఆమె అన్నారు. ప్రతి రైతు ప్రకృతి సేద్యం దిశగా అడుగులు వేస్తే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందన్నారు.



స్టాల్ సందర్శనలో ఆదికర్మ యోగి అభియాన్ ప్రాజెక్టు అసోసియేట్ దివ్యానందన్

పంచాయతీ ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి

వీరఘట్టం: గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కావాల్సిన ఆదాయ వనరులపై సర్పంచ్‌లు, కార్యదర్శులు సంయుక్తంగా దృష్టి సారించాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు సూచించారు. పంచాయతీల పురోగతిపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన ఒక్క రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా చెత్త సంపద కేంద్రాల్లో ఆదాయ మార్గాలను చూడాలన్నారు. సకాలంలో ఇంటి పన్నులు వసూళ్లు చేయడం తదితర అంశాలపై సకాలంలో స్పందించాలన్నారు. సమావేశంలో ఏవో వెంకటరావు, డిప్యూటీ ఎంపీడీవో శంకరరావు, ఏపీవో సత్యంనాయుడు, హౌసింగ్ ఏఈ వినోద్, పంచాయతీ కార్యదర్శి బంగారుబాబు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు

వైద్య శిబిరాలు సద్వినియోగం కావాలి

పాలకొండ: వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.చిరంజీవి అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో మెగా వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగులకు అత్యంత అవసమైన వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శిబిరంలో 590 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని తెలిపారు. శిబిరంలో వైద్య నిపుణలు సేవలు అందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిరంజీవి

వాట్సాప్ గవర్నెన్స్‌తో కుల ధ్రువీకరణ పత్రం

వీరఘట్టం: వాట్సాప్ గవర్నెన్స్‌తో కుల ధ్రువీకరణ పత్రం సులువుగా పొందవచ్చునని తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు సూచించారు. మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో అవగాహన కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. అక్టోబర్ 2 నుంచి వాట్సాప్ గవర్నెన్స్ అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రతీ వ్యక్తి తనకు కావాల్సిన కుల ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉండి అందులో నెట్ బ్యాలెన్స్ ఉంటే సులువుగా కుల ధ్రువీకరణ పత్రం పొందవచ్చునన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ గూర్చి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆటో కార్మికుల ఆందోళన

పాలకొండ రూరల్: రోజువారీ కష్టంపై ఆధారపడి జీవిస్తున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలు స్త్రీశక్తి పథకంతో కుదేలయ్యాయని ఆ సంఘ నాయకులు కాద రాము అన్నారు. తమ డిమాండ్ల అమలుకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆటో, ట్రాన్స్‌పోర్టు కార్మిక సంఘాల నాయకులు డి.పాపారావు, పి.సింహాచలం, దుర్గారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ రూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

వీరఘట్టంలో..

వీరఘట్టం: స్త్రీ శక్తి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించడంతో ఆటో, క్యాబ్, టాటాఏసీ డ్రైవర్ల జీవనోపాధికి గండి పడిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణరావు అన్నారు. ఆటో డ్రైవర్లతో కలసి గురువారం వీరఘట్టం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంటుకు పలు డిమాండ్లుతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సీపీఎం మండల శాఖ అధ్యక్షుడు ఎన్.సింహాచలం, మండల కార్యదర్శి ఎన్.ప్రసాద్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



వీరఘట్టం: తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు